క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విభజన హామీలు, కడప ఉక్కు పరిశ్రమ హామీలను కేంద్రం పూర్తిగా విస్మరించిందని, వీటి అమలు సాధన కోసం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివ కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని ఐటీఐ కళాశాలలో చలో ఢిల్లీ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ వాసులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలం చెందిందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ వస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు రాజు, మణికంఠ, ఇస్మాయిల్ బషీర్, ఇబ్రహీం పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బయాలజీ టీచర్ దాసరి జ్యోతిని వేధింపులకు గురి చేసి ఆత్మహత్యాయత్నానికి ఉసిగొల్పిన వనిపెంట బాలికల గురుకుల పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ నిర్మలపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని సీపీఐ నగర కార్యదర్శి యస్ వెంకట శివ డిమాండ్ చేశారు. గురువారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న దాసరి జ్యోతిని సీపీఐ నాయకులు పరామర్శించి ఆత్మహత్య ప్రయత్నానికి దారి తీసిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పగడపూల మల్లికార్జున, ఏసురత్నం, భాగ్యలక్ష్మి, శివ నాగేంద్ర, ప్రదీప్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

కడప కోటిరెడ్డిసర్కిల్ : రక్తదానం చేయడం ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి తెలిపారు. జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జులై 20 నుండి 26 వరకు నిర్వహిస్తున్న మెగా రక్త వారోత్సవాలు రెండో వార్షికోత్సవం వేడుకల కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేబీపీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్, తన్మయి సాయి, శేఖర్, శ్రీను, దీపక్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



కడప అర్బన్: కడప నగరంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన సురభి లక్ష్మీదేవి (35) ఆర్టీసి బస్టాండ్ వద్ద ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తోంది. ఈనెల 8వ తేదీన మధ్యాహ్నం అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల గ్రామం కస్తూరిరాజుగారిపల్లెకు వెళుతున్నానని చెప్పి ప్రకాష్‌నగర్‌లో ఆటో ఎక్కింది. సాయంత్రానికి వస్తాననీ చెప్పి తిరిగి రాలేదు. గురువారం ఆమె తమ్ముడు తమటపల్లి జగన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్. రాజరాజేశ్వర్ రెడ్డి తెలియజేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ 91211 00520, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ 91211 00521, 91211 00522లకు తెలియజేయాలని కోరారు.

దళితులకు భూమి చెందే వరకు పోరాడుతాం



మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవిశంకర్ రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూమి, దళితులకే చెందేంతవరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని, ఐక్యంగా పోరాడి సాధించి తీరుతామని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలో దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కడప దళితుల భూమి సమస్య పరిష్కరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. దళితుల భూమి సమస్య వీఆర్వో మొదలుకొని రాష్ట్ర రెవెన్యూ ప్రధాన అధికారి వరకు అందరికీ తెలియజేశామని, ఏ ఒక్కరూ స్పందించక పోవడం వల్లనే నిరాహార దీక్షలు చేస్తున్నామని, ఇప్పటికీ స్పందించక పోవడంతో 14వ తేదీన ఆర్డీవో కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ప్రసాద్, మగ్బూల్ బాష, జివి రమణ, ఓబయ్య, మనోహర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

కడప సెవెన్‌రోడ్స్ : గురుపౌర్ణమి పర్వదినాన్ని గురువారం కడప నగరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ఆలయాల్లో విశేష పూజలు గావించారు. భక్తులు ఉదయాన్నే ఆలయాలకు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

- గడ్డిబజారులో వెలిసిన శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయంలో అర్చకులు విజయభట్టర్ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, సామూహిక సత్యనారాయణవ్రతం జరిగాయి.
- కో ఆపరేటివ్ కాలనీలోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి మమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.15 గంటలకు కాకడ హారతి, 6 గంటలకు అభిషేకం, 9 గంటలకు సాయి సత్యవ్రతం, 11.30 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం, 12 గంటలకు మధ్యాహ్న హారతి నిర్వహించారు.
- మున్సిపల్ మైదానం వద్ద ఉన్న శ్రీ దత్తసాయి మందిర్‌లో ఉదయం కాకడ హారతి, మహా గణపతి పూజ, స్వస్తి వాచనం, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామపూజ, మహా మంగళ హారతి, మంత్రి పుష్ప పారాయణం, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్న హారతి, అన్నదాన కార్యక్రమం, సాయినాథుని గ్రామోత్సవం నిర్వహించారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర శివార్లలోని 45వ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్, ఊటుకూరు, ప్రకృతి నగర్‌లో వెలసిన సాయినాధులకు గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, కాకడ హారతి నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేశారు. భగత్‌సింగ్ నగర్‌లో ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

కడప అర్బన్: కడప నగరంలోని నబీకోటలో వున్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు.



కో ఆపరేటివ్ కాలనీలో విశేష అలంకారం సాయినాథుడు



కడప నగరంలో సాయినాథుడిని దర్శించుకుంటున్న భక్తులు



మున్సిపల్ మైదానం వద్దగల దత్తసాయి మందిరంలో విశేష అలంకారం



భగత్‌సింగ్ నగర్‌లో కోలాట ప్రదర్శన



నబీకోటలో ప్రత్యేక అలంకారం

దుర్గమ్మ ఆలయంలో..

కడప సెవెన్‌రోడ్స్ : ఆషాడ పౌర్ణమి సందర్భంగా శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ గురువారం ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు బ్రహ్మయజ్ఞం నిర్వహించారు. జేష్ఠ విధియ మొదలు ఆషాడపౌర్ణమి వరకు అంటే మండలంపాటు కొనసాగిన శ్రీ విజయ దుర్గాదేవి మాలధారణ దీక్ష విరమణ చేశారు. అమ్మవారికి తెల్లవారుజామున గంగ, గోదావరి, కృష్ణా, కావేరి, తుంగభద్ర, యమున తదితర పుణ్య నదీజలాలతో నింపిన 27 పవిత్ర కలశాలతో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ యాగమండపంలో వేద పండితులు శాస్త్రోక్తంగా గణపతి పూజతో ప్రారంభించి సంపూర్ణ చతుర్వేద పారాయణం చేసి చండీ హోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్‌రావు, ఇతర కుటుంబ సభ్యులు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 108 దీపాలతో 108 మంది ముత్తయిదువులు అష్టోత్తర దీపాలంకార సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పల్లకీసేవ జరిగింది. ఆలయంలో చేపట్టిన బ్రహ్మయజ్ఞ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మాలధారులు అమ్మవారికి ఇరుముడులు సమర్పించారు.



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఘనంగా మెగా పీటీఎం వేడుకలు



ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల పేరెంట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి



నారాయణ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



నాగార్జున స్కూల్‌లో మాట్లాడున్న డీసీ కుమార్‌స్వామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు కళాశాలల్లో గురువారం మెగా పేరెంట్ సమావేశాలను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు పలు రకాల పోటీలను నిర్వహించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి పాల్గొని పలు సూచనలు సలహాలను ఇచ్చారు. దీంతోపాటు డీఈఓ షేక్ షంషుద్దీన్, ఏపీసీ నిత్యానందరాజులు ఇందిరానగర్ పాఠశాల వేడుకల్లో పాల్గొన్నారు. ఇంటర్ ఆర్‌ఐవో వెంకటసుబ్బయ్య చైతన్య, నారాయణ జూనియర్ కళాశాలతోపాటు పద్మశ్రీ ఒకేషనల్ కళాశాలలో పాల్గొన్నారు. అలాగే కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు నారాయణ జూనియర్ కళాశాలలో పాల్గొని విద్యార్థులకు సలహాలను ఇచ్చారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాష అన్నారు. గురువారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్-2.0లో భాగంగా నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రామమోహన్‌రెడ్డి, డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, ఏజీఎం చెన్నక్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటస్వామి పాల్గొన్నారు.

స్కూటీని కాల్చిన ఆకతాయిలు

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిస్మిల్లా నగర్‌లో బుధవారం రాత్రి తన ఇంటి వద్ద స్కూటీనీ గులాబ్‌జామ్ అనే వ్యక్తి పార్కింగ్ చేసి వుంచాడు. అర్ధరాత్రి సమయంలో షమీర్ అలియాస్ మొరటోడు అనే వ్యక్తితో పాటు, మహమ్మద్ ఆలీ అనే వ్యక్తితో కలిసి స్కూటీని కాల్చారు. ఉదయం గమనించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా ప్రాంతాలలో సీసీ పుటేజీలను పరిశీలించి నిందితులను పోలీసులు గుర్తించారు.

జేవీవీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 12వ తేదీ నిర్వహించనున్న 18వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌కుమార్ అన్నారు. గురువారం కడపలోని ఎస్టీయూ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు రాష్ట్రంతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పాండుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లతోపాటు ఒరిస్సా రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది కార్యకర్తలు, నాయకులు హాజరవుతారన్నారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, జాతీయ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్‌లు మాట్లాడుతూ ఈనెల 12,13 తేదీలలో నిర్వహించబోయే సమావేశంలో మూఢ నమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం, ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, పర్యావరణ, వ్యవసాయం, సారా వ్యతిరేక ఉద్యమం వంటి అంశాలపై చర్చ జరిపి తీర్మాణాలు చేస్తామన్నారు. జేవీవీ జిల్లా సలహాదారు సురేష్‌బాబు, పలువురు జేవీవీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌కుమార్

కళాశాల అభివృద్ధికి కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: మనకు విద్యా బుద్ధులు నేర్పించిన కళాశాల అభివృద్ధికి తమ వంతుగా పూర్వ విద్యార్థులు సంఘం ఇతోధికంగా కృషి చేయాలని పదవీ విరమణ కృష్ణా జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)లో గురువారం కళాశాల వ్యవస్థాపక దినోత్సవంతోపాటు గురుపౌర్ణమి కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తాము చదువుకున్న కళాశాల రుణాన్ని అభివృద్ధి రూపంలో తీర్చుకోవాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యులు ఆచార్య పుత్తా రాజశేఖర రెడ్డి, డా. వెంకటసుబ్బయ్య, టివి సుబ్బారెడ్డి, సిపిడిసి సభ్యులు చిన్నపరెడ్డిలు ప్రసంగించారు. అనంతరం పూర్వవిద్యార్థుల సంఘం సహకారంతో 2024–25 విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినీ, విద్యార్థులకు బంగారు పతకాలు బహుకరించారు. కళాశాలలో పనిచేసిన పూర్వ గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ జువాలజీ లెక్చరర్ డా.ఎంసి వెంకటసుబ్బయ్య జీవశాస్త్ర విభాగానికి లక్ష రూపాయల ఎండోమెంట్ ప్రైజ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి డా.శివరాం పాల్గొన్నారు.



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు, ముఖ్య అతిథులు

ఎల్ఐసీ నవజీవన్‌శ్రీ పాలసీ ప్రయోజనకరం

కడప సెవెన్‌రోడ్స్ : ఎల్ఐసీ నుంచి వస్తున్న నవజీవన్ శ్రీ అనే మరో కొత్తపాలసీ ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందని ఎల్ఐసీ కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ అన్నారు. పాలసీదారుడు చెల్లించే ప్రీమియంపై గ్యారంటీడ్ లాభాలతో ఈనెల 11 నుంచి అందుబాటులోకి వస్తోందన్నారు. గురువారం స్థానిక డివిజనల్ కార్యాలయంలో ఇతర అధికారులతో కలిసి ఆయన ఈ కొత్త పాలసీకి సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. ఇది సింగిల్ ప్రీమియం పాలసీగానూ, రెగ్యులర్ ప్రీమియం పాలసీగాను తీసుకోవచ్చని ఆయన వివరించారు. 10-13 సంవత్సరాల మధ్య పాలసీ వ్యవధి ఉంటే 8.5 శాతం, 14-17 సంవత్సరాల మధ్య ఉంటే 9 శాతం, 18-20 సంవత్సరాల మధ్య ఉంటే 9.5 శాతం గ్యారంటీడ్ లాభాలు ఉంటాయన్నారు. ఈ పాలసీ లాంఛనంగా ఈనెల 4వ తేది ప్రారంభమైందని, కడప డివిజన్ ఈ పాలసీ అమ్మకంలో సౌత్ సెంట్రల్ జోన్‌లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. లాభాలు అందించే నవజీవన్ ప్రయోజనాలు అందరూ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యాం సుందర్‌రావు, మేనేజర్లు సత్యప్రసాద్, సత్యశ్రీనివాస్, లక్ష్మీకాంతమ్మ, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



నూతన పాలసీ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌డీఎం రవికుమార్, ఇతర అధికారులు

టీబీ గురించి భయం వద్దు

కడప రూరల్: టీబీ గురించి భయపడాల్సిన అవసరం లేదని, చైతన్యంతో ఈ వ్యాధిని అరికట్టవచ్చని డాక్టర్ ఉబేదుల్లా తెలిపారు. గురువారం నగర శివారులోని డీఆర్‌డీఏ జిల్లా సమాఖ్య మీటింగ్ హాల్‌లో టీబీ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది ఒక సంక్రమణ వ్యాధి అని తెలిపారు. దీని లక్షణాలను సకాలంలో గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. వ్యాధి లక్షణాలు సాధారణంగా, నెమ్మదిగా కనిపిస్తాయని తెలిపారు. ప్రారంభంలో సాధారణ జలుబు లేదా దగ్గుగా అనుకొని పట్టించుకోరన్నారు. ఈ లక్షణాలు ఎక్కువ కాలం ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. టీబీ ముక్తా భారత్ అభియాన్ లో భాగంగా ఇంటెన్సిఫైడ్ టీబీ కాంపెయిన్లు గ్రామాలలో జరుగుతున్నాయని, అందరూ ఇందులో భాగస్వాములు కావాలన్నారు. దీర్ఘకాలిక దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం టీబీ లక్షణాలుగా గుర్తించాలన్నారు. వ్యాధిని గుర్తించిన వెంటనే వైద్య సూచనల మేరకు చికిత్స పొందుతే, వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం లావణ్య, జిల్లా సమన్వయకర్త శివశంకర్, సుబ్బరాయుడు, శ్రీధర్, జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉబేదుల్లా

బలిజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయి

కడప రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు బలిజ వర్గీయులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఈ విధానాలను విడనాడకపోతే బలిజలు పాలకులపై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని రాయలసీమ బలిజ సంక్షేమ ఐక్యవేదిక అధ్యక్షులు రాము అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా, ముఖ్యంగా వైయస్సార్ కడప జిల్లాలో బలిజ వర్గీయులపై కక్ష సాధింపు చర్యలు అధికంగా ఉన్నాయని ఆరోపించారు. మైదుకూరు నియోజకవర్గం లో కేసీ కెనాల్ సమీపంలో కొందరు బలిజ వర్గీయులు ఏళ్ల తరబడి డాబాను నిర్వహించుకుంటూ ఉపాధి పొందుతున్నారని అన్నారు. అయితే వారిపై కక్ష సాధింపు చర్యలో భాగంగా డాబాలను తొలగించడం అన్యాయమన్నారు. ఒకరి డాబాను పూర్తిగా తొలగించగా, శ్రీకాంత్ అనే వ్యక్తి స్టే తెచ్చుకోవడం జరిగిందన్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ సంప్రదించగా, ఆయన ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, వీరభద్రుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాము

ఆరోగ్యంగా ఉంటేనే సమర్థంగా విధులు

కడప అర్బన్ : నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని జిల్లా ఎస్పీ ఈ.జి.అశోక్ కుమార్ సూచించారు. గురువారం ఉదయం స్థానిక శ్రీ అరుణాచల హాస్పిటల్, శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్‌లో పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షల శిబిరాలను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సూచనలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో సిబ్బందికి గుండె, లివర్, కిడ్నీ, బి.పి, షుగర్, ఇతర అనేక రకాల వ్యాధులకు సంబంధించిన 20 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20 రోజుల పాటు జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఈ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కంటి చూపు సమస్యలు వంటివి ముందుగానే గుర్తించవచ్చని పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న సిబ్బంది తమ విధులను మరింత సమర్ధవంతంగా, ఉత్సాహంగా నిర్వర్తించగలరన్నారు. కేవలం సిబ్బంది ఆరోగ్యం మాత్రమే కాకుండా, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే సిబ్బంది మనశ్శాంతిగా విధులు నిర్వర్తించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్.పి. బి.రమణయ్య, ఏఆర్ డి.ఎస్.పి శ్రీనివాసరావు, డి.టి.సి డి.ఎస్.పి అబ్దుల్ కరీం, అరుణాచల హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు ఆర్. నిరంజన్‌రెడ్డి, ఏట కోటిరెడ్డి, శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ సి.ఈ.ఓ శరత్ బాబు, మేనేజర్ హరినాథ్, కడప వన్ టౌన్ సీఐ రామకృష్ణ, ఆర్ఐలు టైటస్, వీరేష్, శ్రీశైలరెడ్డి, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఈ.సి మెంబర్స్ మాధవీలత, ఏప్రిన్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

యోగా గురువుకు సన్మానం



యోగా గురువు అయ్యవారురెడ్డిని సన్మానిస్తున్న శిష్యులు

కడప సెవెన్‌రోడ్స్ : గురుపౌర్ణమిని పురస్కరించుకుని కడప నగరానికి చెందిన యోగా గురువు పాలెంపల్లె అయ్యవారురెడ్డిని గురువారం ఆయన శిష్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యోగా గురువు మాట్లాడుతూ తాను గత 27 సంవత్సరాలుగా యాదాళ్ల రంగమ్మ బాలికోన్నత పాఠశాలలో ఉచితంగా యోగా నేర్పిస్తున్నానని తెలిపారు. యోగా వల్ల శారీరక, మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. సమాజంలో అనేక సమస్యలతో మనిషి ప్రతిరోజు సతమతమవుతుంటారని, ప్రశాంతంగా ఉండాలంటే అది యోగా ద్వారానే సాధ్యమవుతుందన్నారు. యోగా నేర్చుకోవాలనే ఆసక్తిగల వారు 98850 66814 నెంబరులో సంప్రదించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 5.00 నుంచి 6.30 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా శిష్యులు తమ గురువు అయ్యవారురెడ్డితో ఉన్న అనుభవాలను పంచుకున్నారు.

బుగ్గ వంక పై హై లెవెల్ బ్రిడ్జీలు నిర్మించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలో బుగ్గ వంకపై షామీరియా మసీదు వద్ద, లా కాలేజీ వద్ద హై లెవెల్ బ్రిడ్జీలు నిర్మించాలని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని షామీరియా మసీదు వద్ద లా కళాశాల వద్ద ఉన్న హైలెవెల్ బ్రిడ్జి ప్రాంతాలను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమం లో కడప అసెంబ్లీ కాంగ్రెస్ సమన్వయ కర్త బండి జకరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఐఆర్‌ను ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ప్రభుత్వ ఉద్యోగులకు ఒరిగింది ఏమి లేదని ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, ఖాదర్‌బాషలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నియమించిన పీఆర్సీ కమిటీ ఏం చేస్తున్నదో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఉద్యోగులు జీతాల పెంపు చూసి ఎన్నో ఏళ్లు అవుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీ వేయడంతోపాటు ఐఆర్‌ను 27 శాతం ప్రకటించాలన్నారు. దీంతోపాటు సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు.


అంత్యక్రియలు



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతున్న ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, మేము సైతం సభ్యులు

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ ఎస్ఐ ఎన్ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం అనాథ వృద్ధుని మృతదేహానికి మేము సైతం సేవా సంస్థ వారితో కలిసి అంత్యక్రియలను నిర్వహించారు. కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా మునిస్వామి (80) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు కుమార్తె మాత్రమే వుంది. ఆమెకు బంధువులు ఎవరూ లేక ఆర్థిక పరిస్థితి బాగాలేక ఎవరూరాక పోవడంతో మేము సైతం సేవాసంస్థ వారికి సమాచారం వచ్చింది. ఈ సమాచారం తెలుసుకున్న చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేము సైతం సేవాసంస్థ సభ్యులు వంకధారి రాము, అయ్యవారయ్య, రామలోకం, గురువయ్య, రామరాజు, పుల్లయ్య పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థికి నగదు బహుమతిని ప్రదానం చేస్తున్న సుకుమారి

కడప ఎడ్యుకేషన్: కడప అంగడివీధి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2024 సంవత్సరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన భానుప్రకాష్‌కు ఆ పాఠశాల సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయు రాలు మేసా సుకుమారి రూ. 15 వేలు, అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన షేక్ ఆఫ్రిద్‌కు రూ. 5 వేల నగదు బహుమతిని అందచేశారు. అలాగే ఆ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ఉపేంద్ర గణితశాస్త్రంలో వందకు వంద మార్కులు సాధించిన భానుప్రకాష్‌కు రూ. 5 వేలు, సైన్సు ఉపాధ్యాయురాలు మాధవిలు ట్రావెలింగ్ బ్యాగ్‌లను అందచేశారు.